

# సెలవులు ఇవ్వాలని ధర్నా

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 24 : మే నెల సెలవులు ఇవ్వాలని కోరుతూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలహీన పర్చడానికి కుట్ర చేస్తున్నదన్నారు. ధర్నా అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవిక, లావణ్య, రేష్మ, జిల్లా సహాయ కార్యదర్శులు రమ్య, భాగ్య, జిల్లా నాయకులు పుష్పలత, కవిత, మీనాక్షి, నర్సమ్మ పాల్గొన్నారు.



## ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట..

ఎదులాపురం, ఏప్రిల్ 24 : అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సునీత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, సహాయ కార్యదర్శి ఎస్.నవీన్‌కుమార్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రత్నమాల, ముక్త ప్రమీల, సుభద్ర, అనసూయ, నజీమా, లక్ష్మి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

## రౌడీయిజాన్ని కనుమరుగు చేస్తాం

ఎదులాపురం, ఏప్రిల్ 24 : జిల్లాలో రౌడీయిజాన్ని కనుమరుగు చేస్తామని, వారు ప్రవర్తన మార్చుకోకపోతే జైలుకి పంపిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గురువారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో రౌడీషీట్లుగా నమోదైన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీయిజం చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తూ, అన్ని రకాలుగా అష్టదిగ్బంధనం చేస్తామన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లు తొలగించి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రౌడీ షీటర్లు గంజాయి, మట్కా, రౌడీ ఇజం, హత్యలు, హత్యాయత్నాలు, నేరాలు, బెదిరించడం, కొట్లాటలు, గొడవల వంటివి చేస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్ రావు, సాయినాథ్, ఫణిదర్ పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి


# హైదరాబాద్‌కు దీటుగా విద్యను అందిస్తున్నాం..

### స్టేట్ ర్యాంకర్లను సన్మానించిన అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 24 : హైదరాబాద్‌లోని కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నిర్మల్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్లను గురువారం అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలను నమ్మి తల్లిదండ్రులు మెరిట్ స్టూడెంట్లను అప్పజెప్పినందుకు ధన్యవాదాలు తెలిపారు. అల్ఫోర్స్‌లో విద్యతోపాటు విలువలను అందిస్తున్నామని అన్నారు. ముమ్మందు హైదరాబాద్ కళాశాలలకు దీటుగా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరెన్నో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

#### టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు..

ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో ఉమ్మడి జిల్లా టాపర్స్‌గా కృష్ణవేణి 468, జోసి ప్రసూన శ్రీ 468, కీర్తిశ్రీ 468, బాలుర విభాగంలో శ్రీ చరణ్ 467, అఖిల్ 467, కార్తికేయన్ 467 మార్కులు సాధించారు. బైపీసీలో సామఫిర్దోస్, మహవీర్, నబిలా తహరీమ్ 438 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ, బైపీసీలో కమల్ ప్రీత్ కౌర్ 995, సుమయ ఖానం 994, జాదవ్ నవ్యశ్రీ 993 మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.




జిల్లాలవారీగా ఉష్ణోగ్రత(డిగ్రీల సెల్సియస్)

| ఆదిలాబాద్(తాంసి) | నిర్మల్ (కుభీర్) | మంచిర్యాల(భీమిని) | ఆసిఫాబాద్(తిర్యాణి) |
|---|---|---|---|
| 45.2 | 45.2 | 45.0 | 44.9 |

# భానుడి ఉగ్రరూపం

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దంచికొడుతున్న ఎండలు

- రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- గురువారం మంచిర్యాలలో గరిష్ఠంగా 45 డిగ్రీల నమోదు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. భానుడు ఉగ్రరూపందాల్చడంతో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం ఎనిమిదింటి నుంచే సూర్యుడు నిప్పులు కురిపిస్తుండగా, సాయంత్రం ఏడింటిదాకా వేడిమి ఉంటుంది. గురువారం ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 44.2 డిగ్రీలు, నిర్మల్‌లో 44.2, మంచిర్యాలలో 45.0, కుమ్రం భీం ఆసిఫాబాద్ 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు వడగాలులు.. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కావాల్సి వచ్చింది. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి అప్రకటిత కర్ఫ్యూను తలపించింది. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ఇక ప్రస్తుతం పెండ్లిళ్ల సీజన్ కాగా, దగ్గరి బంధువులు తప్ప ఎవరూ వెళ్లడం లేదు. వివాహ వేదికలు వెలవెలబోతున్నాయి. ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు.. ఏసీలను విపరీతంగా వినియోగిస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మే.. నెలలో సూర్య ప్రతాపం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.



ఆదిలాబాద్‌లోని జాతీయ రహదారి

### జాగ్రత్తగా ఉండాలి



ఎండలు ముదిరాయి. వడగాల్పులు వీస్తున్నాయి. ఎండలో ఎక్కువ సమయం గడిపేవారు వడదెబ్బ బారినపడకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. నూలు దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగును ఉపయోగించాలి. ఎక్కువ సమయం నీడ ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి. మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకుంటే వడదెబ్బ భారీ నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని వైద్యశాలకు వెళ్లాలి.

- డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ చెన్నూర్



ఎండ నుంచి రక్షణ కోసం జనాల పాట్లు

# వడదెబ్బతో నలుగురి మృతి



సోఫిబేగ్ (ఫైల్)



రాసమల్ల భూదేవి (ఫైల్)



లోంకర్ ప్రభాకర్ (ఫైల్)

జైనూర్/పెంచికల్‌పేట్/జన్నారం/నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 24 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వడదెబ్బతో నలుగురు మృత్యువాత పడ్డారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి చెందిన కనక కాశీరాం (42) సీఆర్‌టీగా జొడేఘాట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని స్వగ్రామమైన మార్లవాయికి వచ్చాడు. కాసేపటికే తీవ్ర అస్వస్థతతో మృతి చెందాడు. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన లోంకర్ ప్రభాకర్ (24) బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో దహెగాంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లాడు. అక్కడ పొలం పనులు చేస్తుండగా, ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆటోలో దవాఖానకు తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. ఇక మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తొమ్మిదిగుడిసెల పల్లెకు రాసమల్ల భూదేవి(60) బుధవారం కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాగా, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గురువారం తెల్లావారు జామున మృతి చెందినట్లు ఆమె కుమారుడు రాసమల్ల స్వామి తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురికాలనీకి చెందిన మహ్మద్ బేగ్ కుమారుడైన సోఫిబేగ్ (25) గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. సోఫిబేగ్ మూడు నెలల క్రితమే దుబాయ్ నుంచి నిర్మల్‌కు వచ్చాడు.

# నిప్పుల కొలిమిలా కోల్ బెల్ట్

- ఓసీపీల్లో విలవిల్లాడుతున్న కార్మికులు
- విధుల సమయాలు మార్చాలని డిమాండ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 24 : భానుడి భగభగలతో కోల్‌బెల్ట్ ప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలతో పాటు జైపూర్ విద్యుత్ కేంద్రం, సిరామిక్స్, సిమెంట్ పరిశ్రమల ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉపరితల గనుల్లో బొగ్గును వెలికి తీయడానికి ప్రతిరోజూ టన్నులకొద్ది పేలుడు పదార్థాలు వినియోగిస్తుంటారు. ఫలితంగా గాలి వేడెక్కి సాధారణం కన్నా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో నిల్వ చేసే బొగ్గు ప్రభావం కూడా వాతావరణంపై పడుతుంది. ఇక గనుల్లో పనిచేసే కార్మికులు వేడిమికి తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. విధులు నిర్వహించలేని పరిస్థితి ఉందని, విధుల సమయాలు మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



నిర్మానుష్యంగా శ్రీరాంపూర్ ఓసీపీ క్వారీ



నేరడిగొండలో కొవొత్తుల ర్యాలీలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# పహల్గావ్ ఘటన దురదృష్టకరం

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రమూకల దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, హిందూ సంఘాల నాయకులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, భీంపూర్ జడ్పీటీసీ సుధాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కిరణ్, వెంకటరమణ, సాబ్లె సంతోష్‌సింగ్ పాల్గొన్నారు.

- నేరడిగొండ, ఏప్రిల్ 24

# చి‘వరి’కి అందని నీరు


కడెం, ఏప్రిల్ 24 : వరికి నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. మండలంలోని కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్‌తండా, ధర్మాజిపేట, చిట్యాల్, ఎలగడప, నచ్చన్‌ఎల్లాపూర్, మాసాయిపేట, లింగాపూర్ గ్రామాలకు సదర్మాట్ కాలువ ద్వారా నీరు అందాల్సి ఉంది. యాసంగి పంట కోసం గతంలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు రైతులు సాగు చేశారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలకు చివరికి నీరు అందక పంటలు ఎండిపోయిన పరిస్థితి దాపురించింది. ఇంకో రెండు వారాలపాటు నీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు. పంట పొట్ట దశకు చేరి గింజ పెరుగుతున్న సమయంలో నీరు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. మా నష్టానికి ప్రజాప్రతినిధులు, అధికారులే కారణమని మండిపడ్డారు. ఎండిపోయిన కాలువను చూపిస్తూ రైతులు కాలువలో దిగి నిరసన తెలిపారు. పంట చేతికొచ్చే దశలో నీరు అందక నష్టపోతున్నామని రైతులు వారి గోడును వెలిబుచ్చారు. నష్టపోయిన తమకు ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



కాలువలో దిగి నిరసన తెలుపుతున్న రైతులు

# కేసీఆర్‌తోనే పల్లెల అభివృద్ధి

జైనథ్, ఏప్రిల్ 24 : కేసీఆర్ సారథ్యంలోనే గ్రామాలు అభివృద్ధి దశకు చేరుకున్నాయని, జాతీయ స్థాయిలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాలే అవార్డులను సొంతం చేసుకున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. నిజమైన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం కేసీఆర్ లాంటి పాలనతో సాధ్యం చేసుకోగలిగామని కొనియాడారు. మండలంలోని కాపరి గ్రామంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మహేందర్, మాజీ సర్పంచ్‌లు ఎల్టీ వెంకటరెడ్డి, రవీందర్, రామన్న పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 24 : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి, కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధరణికి బదులుగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి అని పేరు పెట్టినంత మాత్రాన సమస్యలు తీరవని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సన్న చిన్నకారు రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రజల కోసం నాయకులు అధికారులు ఎల్లవేళలా పనిచేయాలని ఎంపీ గోడం నగేశ్ సూచించారు. కాగా.. రుణ మాఫీ కాలేదని భూ భారతి అవగాహన సదస్సుకు వచ్చిన కలెక్టర్ రాజర్షి షాకు అఖిల పక్షం ఆధ్వర్యంలో రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమం మధ్యలో నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలు వెళ్లడంతో రైతులు కూడా వెనుదిరిగారు. దీంతో ప్రాంగణంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.



భూభారతి సదస్సులో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు